ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
బుధవారం 3 జూలై 2024

6న కొత్తూర్ తైబజార్ వేలం

కొత్తూర్, జూలై 2: ఈనెల 6న కొత్తూర్ మున్సిపాలిటీ తైబజార్‌కు వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బాలాజీ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 6వ తేదీన శనివారం ఉదయం 11 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో తైబజార్ వేలం నిర్వహిస్తున్నట్లు అయన పేర్కొన్నారు. తైబజార్ వేలం పాటలో పాల్గొనే వారు 2వేల రుపాయలు చెల్లించి దరఖాస్తు పొందాలని సూచించారు. అదేవిధంగా 10వేల రుపాయల డీడీ జత చేసి ఈనెల 5న మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలని కమిషనర్ పేర్కొన్నారు.


కళకళలాడుతున్న పత్తి చేను

పంటలకు జీవం

నెలరోజులుగా వర్షాభావ పరిస్థితులు నెలకొని విత్తిన కంది, పత్తి, పెసర, మినుము విత్తనాలు మొలుస్తాయో లేదో...మొలిచిన మొలక నిలబడుతుందో లేదోనని రైతులు ఆవేదన చెందారు. వరుణుడు కరుణించాలని దేవుళ్లందరినీ వేడుకున్నారు. వర్షాల కోసం కప్పకావడి, వరదపాశం, ప్రత్యేక పూజలు చేశారు. ఇంతలో మూడు రోజుల క్రితం వర్షాలు కురియడంతో మెట్ట పంటలకు జీవం పోసినట్టయింది. రైతులు పొలం బాటపట్టారు. సస్యరక్షణ చర్యలు చేపట్టారు. కూలీల చేత కలుపు తీయిస్తున్నారు. పత్తి మొలకలకు ఎరువులు వేస్తూ ఎక్కడ చూసినా పొలాల్లో రైతులు బిజీగా కనిపిస్తున్నారు.

- బషీరాబాద్, జూలై 2


బషీరాబాద్ మండలంలో ఊపందుకున్న కలుపుతీత పనులు





ఇల్లు లేని అర్హులైన నిరుపేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు గత ప్రభుత్వం మంజూరు చేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వాటి ఊసెత్తకుండా ఇందిరమ్మ ఇళ్ల పథకం తీసుకు వచ్చింది. అధికారంలోకి వచ్చిన తొలి రోజుల్లోనే గ్రామాల్లో ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించి ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తులను స్వీకరించింది. జిల్లాలో వేలాది మంది దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం అడ్డం కిగా మారిందా.. అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇళ్లు.. ఇంకెన్నేళ్లు?

- ఏళ్లు గడుస్తుండటంతో భరోసా కోల్పోతున్న లబ్ధిదారులు
- ఎనిమిదేళ్ల కిందట 6,645 గృహాలు మంజూరు
- ఇప్పటివరకు పూర్తయినవి 2,293 మాత్రమే
- ఇంకా 4,352 గృహాలు పూర్తి కావాల్సి ఉంది
- డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం లక్షమంది వరకు ఎదురుచూపు
- లాటరీ ద్వారా 1,988 మందినే గుర్తించిన అధికారులు
- పంపిణీ చేద్దామనుకున్న లోపే అసెంబ్లీ ఎన్నికలు
- ప్రస్తుతం నిరుపయోగంగా మారిన ఇళ్లు

డబుల్ బెడ్‌రూం ఇళ్లు వస్తయా.. రావా?

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జూలై 2 : పేదోడి సొంతింటి కల.. కలగానే మిగులుతోంది. ఇల్లు లేని పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని గత సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు. జిల్లాలో ప్రారంభించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తిస్థాయిలో నిర్మాణం జరగలేదు. అరకొర నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులకు అందివ్వలేదు. చాలావరకు ఇంటి నిర్మాణాలను ప్రారంభించనే లేదు. జిల్లాలో 2015-16, 2016-17 వార్షిక సంవత్సరంలో 6,777 డబుల్ బెడ్‌రూమ్స్ కేటాయించారు. స్థానిక శాసనసభ్యులు, జిల్లా మంత్రి కమిటీ ద్వారా జిల్లా కలెక్టర్ 6,637 డబుల్ బెడ్‌రూమ్స్ మంజూరు చేశారు. ఇందుకోసం 247.34 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించారు. మంజూరైన 6,637 గృహాల్లో 1,705 చేవెళ్ల, కల్వకుర్తి నియోజవర్గాల్లో పీఆర్ శాఖకు, 4,932 గృహాలు ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్, షాద్‌నగర్ నియోజవర్గాల్లో నిర్మించేందుకు ఆర్ అండ్‌బీ శాఖకు అప్పగించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం కోసం రూ.128.13 కోట్లు మేనేజింగ్ డైరెక్టర్(హెచ్) హైదరాబాద్ ద్వారా మంజూరయ్యాయి. ఇందులో భాగంగా 123.63 కోట్లు రోడ్డు భవనాల శాఖ, పంచాయతీ రాజ్‌శాఖ నుంచి రూ.450 కోట్లు డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలకు విడుదల చేశారు. జిల్లాలో 2,293 గృహాల నిర్మాణాలు పూర్తయ్యాయి. ప్రస్తుతం విద్యుత్, డ్రైనేజీ పనులు చేపట్టాల్సి ఉంది. ఇప్పటికే పూర్తయిన 2,293 ఇళ్లకు సంబంధిత మండల తహసీల్దారులు ఇంటింటి సర్వే చేసి లబ్ధిదారులను ఎంపిక చేశారు. 1,988 ఇళ్లకు లబ్ధిదారులను లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేశారు. అయితే, వారికి గృహ మంజూరు పత్రం ఇచ్చి ఇంట్లోకి పంపిస్తారా.. లేదా అనే విషయం ప్రశ్నార్థకంగా మారింది.

నెరవేరని గత ప్రభుత్వ హామీ!

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత సీఎం కేసీఆర్ ఇల్లు లేని నిరుపేద ఉండకూడదని పేదలకు డబుల్‌బెడ్‌రూం ఇల్లు కట్టిస్తానని హామీ ఇచ్చారు. అనుకున్నదే తడవుగా ప్రభుత్వం వెంటనే డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. కానీ.. ఆశించిన స్థాయిలో ఆ పథకం గత ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చిపెట్టలేక పోయింది. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలకు నిధుల కొరత ప్రభుత్వానికి ప్రజల్లో అసంతృప్తిని పెంచింది. నిధుల కొరత కారణంగా నిర్మాణ దశలోనే ఉండిపోయినవి కొన్ని అయితే.. నిర్మాణాలు పూర్తయి పంపిణీకి నోచుకోనివి మరికొన్ని ఉన్నాయి.

ఏళ్ల తరబడి వేచి చూస్తున్నాం



మాకు సొంతిల్లు లేదు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇచ్చేందుకు దరఖాస్తులు స్వీకరిస్తే.. మేము కూడా దరఖాస్తు చేసుకున్నాము. కానీ.. ఇప్పటి వరకు మాకు ఇల్లు మంజూరు కాలేదు. మండలంలో అసంపూర్తిగానే ఇళ్ల నిర్మాణం ఉంది. డబుల్ బెడ్‌రూం ఇల్లు ప్రభుత్వం ఇస్తుందని ఎన్నో ఏళ్ల నుంచి వేచి చూస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీల్లో ఇంటికోసం దరఖాస్తు చేసుకున్నాను. గత ప్రభుత్వంలో ఇల్లు రాలేదు. ఈ ప్రభుత్వంలో నేనా ఇల్లు వస్తుందన్న ఆశతో ఉన్నాను.

- సారంగి వీరస్వామి, హిమాయత్‌నగర్, మొయినాబాద్ మండలం

ఇళ్లకు కేటాయించిన భూమి

నియోజకవర్గం	భూమి (ఎకరాల్లో)
చేవెళ్ల	64.06
కల్వకుర్తి	43.25
ఇబ్రహీంపట్నం	50.04
మహేశ్వరం	12.58
రాజేంద్రనగర్	9.25
షాద్‌నగర్	95.17

డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ వివరాలు

- కేటాయించిన ప్రభుత్వ భూమి: 274.35 ఎకరాలు
- కేటాయించిన గృహాలు: 6,777
- గ్రామీణ: 3,977, మున్సిపాలిటీ: 2,800
- మంజూరైన గృహాలు: 6,645
- టెండర్ పిలిచినవి: 6,175
- టెండర్ అమోదించినవి: 2,836
- పురోగతిలో ఉన్నవి: 2,637
- పూర్తి అయినవి: 2293
- లబ్ధిదారులకు కేటాయించినవి: 1988
- దరఖాస్తు చేసుకున్న వారు: 97,616

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల వివరాలు

నియోజకవర్గం	కేటాయించిన గృహాలు	మంజూరైనవి	టెండర్ పిలిచినవి	టెండర్ ఆమోదం	పురోగతిలో ఉన్నవి	లబ్ధిదారులకు కేటాయింపు
చేవెళ్ల	1,060	1060	990	100	100	72
కల్వకుర్తి	738	645	645	0	0	0
ఇబ్రహీంపట్నం	1,239	1,200	1056	339	335	119
మహేశ్వరం	400	400	192	192	192	80
రాజేంద్రనగర్	240	240	240	140	130	78
షాద్‌నగర్	3,100	3,100	3,052	2,065	1,880	1,639


వెంకమ్మగూడలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు

- పారిశ్రామిక హబ్‌గా షాబాద్
- జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

షాబాద్, జూలై 2 : ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి ఏదో ఒక రూపంలో అందుతున్నాయని జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితా రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యలు అన్నారు. మంగళవారం షాబాద్ మండలం వెంకమ్మగూడ గ్రామంలో రూ. 5 లక్షలతో చేపట్టిన డ్వాక్రా భవనం, రూ. 5 లక్షలతో సీసీ రోడ్డు పనుల నిర్మాణం, అండర్ డ్రైనేజీ ఏర్పాటు పనులకు జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డితో కలిసి వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న ఆరు గ్యారెంటీలు అర్హులైన వారికి అందజేస్తామన్నారు. రాష్ట్రంలోని అతిపెద్ద పారిశ్రామిక హబ్‌గా చందన్‌వెల్లి, సీతారాంపూర్ రూపాంతరం చెందుతుందని అన్నారు. చందన్‌వెల్లి పారిశ్రామిక వాడలో ప్రతిష్టాత్మకమైన అమెజాన్, వెల్‌స్పన్, కుందన్, కటెరా, మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీలు ఈ ప్రాంత వాసులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. అలాగే సీతారాంపూర్‌లోని పారిశ్రామిక వాడలో పారిశ్రామిక కంపెనీ అయిన వోలెక్ట్రా ఎలెక్ట్రానిక్ వెహికిల్ ఉత్పత్తి ప్లాంట్, కిటెక్స్ కంపెనీ ద్వారా సుమారు 15 వేల మంది మహిళలకు ఉపాధి లభిస్తుందన్నారు. మన షాబాద్ మండల పరిసర ప్రాంతాల వద్ద నుండే రీజినల్ రింగ్‌రోడ్డు వస్తుందని, దానివల్ల షాబాద్ మండలం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతి పల్లెనూ అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్‌రావు, కోఆప్షన్ సభ్యులు చాంద్‌పాష, మాజీ ఎంపీపీ వెంకటయ్య, మాజీ సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, కృష్ణగౌడ్, శకుంతల, దేవేందర్‌రెడ్డి, దర్శన్, మాజీ ఎంపీటీసీ మద్దూరి పాండు, నాయకులు నర్సింహులు, పాపిరెడ్డి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులతో యూనియన్ నాయకులు

జీపీ కార్మికులకు పనికి తగిన వేతనాలివ్వాలి

కొందుర్గు, జూలై 2: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని తెలంగాణ సర్వీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని విశ్వనాథ్‌పూర్, చెర్కుపల్లి గ్రామాల్లో గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని పంచాయతీ ఆవరణలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. వెంకటయ్య మాట్లాడుతూ ఒక కార్మికుడికి ఇచ్చిన వేతనాన్ని ఇద్దరు లేదా ముగ్గురికి పంచి ఇస్తున్నారని, పనికి తగిన వేతనం అందడం లేదని, కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కర్ణాటక సర్వీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమన్వయ కర్త మల్లిఖార్జున్ మాట్లాడారు. తమ రాష్ట్రంలో కార్మికులకు తెలంగాణలో కంటే ఎక్కువగా వేతనాలు చెల్లిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.ప్రభుదాస్, రాష్ట్ర మహిళా యూనియన్ కార్యదర్శి వెంకటేశ్వరమ్మ, జిల్లా యూనియన్ ప్రతినిధి శ్రీనివాసులు, ఎ.అశోక్‌కుమార్, కార్మికులు యాదయ్య లక్ష్మమ్మ, ఎం.జంగయ్య, నర్సయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పించిన జైకిసాన్ సభ్యులు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

శంకర్‌పల్లి, జూలై 2: ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని జైకిసాన్ ఇండియా చైర్మన్ నరేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. మోకిల గ్రామంలోని రైతు వేదిక వద్ద మంగళవారం తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం, జైకిసాన్, బాసట ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు కాలనీ వాసులకు దేశీయ విత్తనాలు, ప్రకృతి వ్యవసాయం, రసాయన రహిత పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనాలు లేకుండా పండించిన పంటలను వినియోగించడం ద్వారా ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. జీవామృతం ఉపయోగించి నేలను సుసంపన్నం చేయాలని అన్నారు. బాసట ఫౌండేషన్ అధ్యక్షురాలు వాణి మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం పూర్తిగా తగ్గించాలని సూచించారు. రైతులు పండించే పంటల్లో ఎలాంటి హానికరమైన రసాయనాలూ వాడకూడదని, వీటితో క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. భావితరాలకు మంచి నేల, ఆరోగ్యం ఇవ్వాలన్నారు. భూమి, గాలి, నీరు కలుషితం కాకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు రామకృష్ణారెడ్డి, రమ్య, రైతులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్వహణ గాలికి!

- రోడ్లను తవ్వుతూ నాశనం చేస్తున్న కొందరు
- ప్రకృతి వైపరీత్యాలతో మరికొన్ని ధ్వంసం
- పట్టించుకునే నాథుడు కరువు
- ఆందోళనలో స్థానికులు, వాహనదారులు

కేశంపేట, జూలై 2: రోడ్ల నిర్వహణను అధికారులు సరిగా పట్టించుకోకపోవడంతో ఎవరి ఇష్టారాజ్యంగా వారు రోడ్లను తవ్వేస్తున్నారు. అధికారులకు తెలియకుండానే రాత్రికి రాత్రి తవ్వకాలు జరుపుతున్నారు. దీనికి తోడు ప్రకృతి వైపరీత్యాలతో మరికొన్ని రోడ్లు దెబ్బతింటున్నాయి. అయినా, వీటి గురించి పట్టించుకునే నాథుడు లేడన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేశంపేట మండలంలో ప్రధానంగా కేశంపేట - షాద్‌నగర్, కేశంపేట - ఆమన్‌గల్, కేశంపేట- కడ్తాల్, కొత్తపేట- షాద్‌నగర్, బైర్కాన్‌పల్లి- లింగంధన రోడ్లున్నాయి. ఇటీవల షాద్‌నగర్ - కొత్తపేట మీదుగా మక్తమాధారం వరకు డబుల్ రోడ్డు నిర్మించారు. ఈ మార్గంలో తులవానిగడ్డ సమీపంలో రోడ్డుపై కల్వర్టు నిర్మించాల్సిన అవసరం ఉంది. షాద్‌నగర్ - కేశంపేట రోడ్డు గుంతలు ఏర్పాడ్డాయి. గుంతలను తప్పించే క్రమంలో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గంలో ఇప్పలపల్లి గ్రామ సమీపంలో ఉన్న మూలమలుపులు అతి దగ్గర ఉండడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ ప్రమాదాలు జరుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇదే మార్గంలో కొందరు రైతులు తమ ఇష్టానుసారంగా రోడ్లను తవ్వుతూ పైప్‌లైన్‌లు వేస్తున్నారు. ఇలా తవ్వి వదిలేస్తుడంతో ఆ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. తొమ్మిదిరేకుల- లింగంధన గ్రామాల మధ్య రోడ్డు తవ్వి వదిలేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేశంపేట- కొత్తపేట రోడ్ల మార్గంలో సైతం ప్రధాన రోడ్డును కొందరు వారి అవసరాల మేరకు తవ్వి ప్రమాదాలకు కారణమవుతున్నారు. అంతేకాకుండా వర్షాలు బాగా కురిసినప్పుడు రోడ్డుపై నుంచి పారే నీటితో రోడ్డు కింది మట్టికొట్టుకు పోయి కోతకు గురై ప్రమాదాలకు కారణం అవుతుంది. వేముల్‌నర్వ సమీపంలో వరదలకు షాద్‌నగర్ ప్రధాన రహదారి దెబ్బతిన్నది. రోడ్డు కింద మట్టికొట్టుకు పోయి కుంగిపోతుంది.


తొమ్మిదిరేకుల - లింగంధన రోడ్డుకు అడ్డంగా తవ్వి వదిలేసిన దృశ్యం


వేముల్‌నర్వ వద్ద వర్షానికి కొట్టుకుపోయిన మట్టి

ప్రమాద ప్రాంతాలను గుర్తించి బాగు చేయాలి



ప్రమాదాలకు కారణం అవుతున్న ప్రాంతాలను అధికారులు గుర్తించాలి. కొందరు రైతులు అవగాహన లేకుండా రోడ్డును ఇష్టానుసారంగా తవ్వుతున్నారు, వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలి. అధికారుల అనుమతులు లేకుండా రోడ్డును తవ్వితే చట్టపరమైన చర్యలు ఉంటాయన్న విషయాన్ని తెలియజేయాలి. వరదలకు దెబ్బతిన్న రోడ్లను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

- మనోహర్ గౌడ్, వేముల్‌నర్వ, కేశంపేట మండలం

మూలమలుపు వద్ద ప్రమాదాలు



లింగంధన సమీపంలోని మూలమలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలాంటి ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ఈ మూల మలుపుల వద్ద కొందరు రోడ్డును తవ్వి వదిలేశారు. ఇది కూడా ప్రమాదాలకు కారణం అవుతుంది. అధికారులు స్పందించి ఇలాంటి ప్రాంతాలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలి.

- మధుసూదన్ గౌడ్, లింగంధన మాజీ సర్పంచ్

మా దృష్టికి వస్తే బాగు చేస్తాం

రోడ్లు తవ్వినట్లు మా దృష్టికి వస్తే బాగు చేయిస్తాం. గ్రామ పంచాయతీ రోడ్లనే మా పరిధిలో గమనిస్తున్నాం. ఎవరైనా రోడ్డు తవ్వాల్సి వస్తే అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. రోడ్డు తవ్వి వదిలేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అనుమతి తీసుకుని పనులు చేస్తే, వారి చేతనే రోడ్డును బాగుచేయిస్తాం.

- భూపాల్, కేశంపేట పీఆర్ఏఈ

గవర్నర్‌తో స్పీకర్, చైర్మన్ భేటీ



హైదరాబాద్, జూలై 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్‌ను శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్ మంగళవారం రాజ్‌భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు. గవర్నర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి కలిసిన మరుసటి రోజే శాసనమండలి చైర్మన్, శాసనసభ స్పీకర్ కలవడం చర్చనీయాంశమైంది. అయితే గవర్నర్ రాధాకృష్ణన్‌ను తాము మర్యాదపూర్వకంగానే కలిశామని శాసనసభ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ప్రాజెక్టుల నిర్వహణకు నిధులేవి?

ఏటా రూ.600కోట్లపైనే అవసరం.. ఏడు నెలలుగా నిధుల మంజూరుకు బ్రేక్

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ కోసం కొన్నాళ్లుగా నిధులు విడుదల కావడం లేదు. గత డిసెంబరులోనే కొత్త ప్రభుత్వం ఏర్పడడం, ఆ తర్వాత వరుస ఎన్నికలు రావడంతో నిధుల మంజూరుకు బ్రేక్ పడింది. ఫలితంగా పలు ప్రాజెక్టుల పరిధిలో వానాకాలంలోగానే చేపట్టాల్సిన మరమ్మతులు సైతం నిలిచిపోయాయి. ప్రాజెక్టుల నిర్వహణకు సంబంధించిన నిధుల చెల్లింపులకు గ్రీన్‌చానల్ అమలు చేయాలని ప్రతిపాదనలు వచ్చినా.. గత ప్రభుత్వం అమలు చేయలేదు. ఫలితంగా గత డిసెంబరు నుంచి ఇప్పటిదాకా రూ.100కోట్ల మేర ఓ అండ్ ఎం పనులకు సంబంధించిన బిల్లులు ఆగిపోయాయి. ఏ శాఖకు లేని విధంగా నీటి పారుదల శాఖకు కార్యదర్శి, ప్రత్యేక కార్యదర్శులు ఉన్నా.. ఈ అంశంపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో 40 వరకు భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు ఉండగా 42,000 కిలోమీటర్ల మేర ప్రధాన కాల్వలు, డిస్ట్రిబ్యూటరీ కాల్వలు ఉన్నాయి. ఇవీ కాక 900 కిలోమీటర్ల మేర పైప్ కెనాల్ వ్యవస్థ కూడా ఉంది. 138 పంప్‌హౌస్‌లు, 115దాకా సబ్‌స్టేషన్లు(నీటిపారుదలశాఖకు ప్రత్యేకంగా కట్టిన), 1.30లక్షల కెనాల్ నిర్మాణాలు(అక్విడెక్ట్‌లు, బ్రిడ్జిలు, సైఫన్లు) ఉన్నాయి. ప్రధాన డ్యామ్‌లు, రిజర్వాయర్ల పరిధిలోని గేట్లు, జనరేటర్లు, రోప్ వైర్లకు మరమ్మతులు, లీకేజీల నివారణ, కాలువల్లో కలుపు మొక్కల తొలగింపు, దెబ్బతిన్న కాలువల మరమ్మతులు, గేట్ల పెయింటింగ్, గ్రీజింగ్.. ఇలాంటివన్నీ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓ అండ్ ఎం) కిందకే వస్తాయి. ఏటా వీటి నిర్వహణకు సుమారుగా రూ.600కోట్లు అవసరమవుతాయని అంచనాలున్నాయి. అయితే, గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంతోపాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) తొలి త్రైమాసికంలోనూ ఓ అండ్ఎం కోసం నిధులు విడుదల చేయలేదు. దాదాపు రూ.100కోట్లకుపైగా బిల్లులు ఆగిపోవడంతో చిన్న కాంట్రాక్టర్లు విలవిల్లాడుతున్నారు.



మొహం చాటేస్తున్న పెద్ద కాంట్రాక్టర్లు

లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల వైఫల్యానికి ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓ అండ్ ఎం) లోపమే ప్రధాన కారణమని జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ తేల్చిన విషయం తెలిసిందే. నిర్వహణ పనుల ఖరీదు చిన్నదే అయినా... వాటిని విస్మరిస్తే కలిగే నష్టం వందల కోట్ల మేర ఉంటుందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో అత్యంత కీలకమైన నాగార్జునసాగర్, శ్రీరామ్‌సాగర్, కడెం ప్రాజెక్టుల నిర్వహణ పనులకు టెండర్లు పిలిస్తే.. బడా కాంట్రాక్టలెవరూ స్పందించలేదు. దీంతో చిన్న కాంట్రాక్టర్లతోనే పనులు చేయించాల్సిన పరిస్థితి నెలకొంది. గిట్టుబాటు కాకపోవడం, సకాలంలో చెల్లింపులు చేయకపోవడంతోనే పనులు చేసేందుకు పెద్ద కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు.


అధికారాలున్నా నిధుల్లేవు

ప్రాజెక్టుల నిర్వహణ పనులను పెండింగ్‌లో పెట్టకూడదన్న ఉద్దేశంతోనే అధికారాలను వికేంద్రీకరిస్తూ నీటిపారుదల శాఖ గతంలోనే నిర్ణయం తీసుకుంది. ఇంజనీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ) స్థాయిలో రూ.కోటి, చీఫ్ ఇంజనీర్(సీఈ) రూ.50లక్షలు, సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్(ఎస్ఈ) రూ.25లక్షలు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ) రూ.5లక్షల మేర పనులకు అనుమతులు ఇచ్చే అధికారాన్ని కల్పించింది. నిర్వహణ పనుల కోసం ప్రత్యేకంగా విభాగాన్ని, ఒక ఈఎన్‌సీతో కూడిన టీమ్‌ను ఏర్పాటు చేసింది. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టడానికి కొంత మేర నిధులను వీరి వద్ద అందుబాటులో ఉంచాలని నిర్ణయించింది. అయితే, ఇప్పుడు వీరి వద్ద ఒక్క పైసా కూడా లేదు. వీరి వద్ద నుంచి వచ్చిన బిల్లులు సైతం ఆగిపోవడం గమనార్హం. కొత్త ప్రభుత్వమైనా ఈ విధానాన్ని సంస్కరించి, ఓఅండ్ఎం బిల్లులను గ్రీన్‌చానల్‌లో పెట్టాలని పలువురు కోరుతున్నారు.

ఏపీలో పేదలకు ఇసుక ఉచితం!

విధివిధానాల తయారీకి సీఎం చంద్రబాబు ఆదేశం

ఎవరైనా ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకోవాల్సిందేనని వెల్లడి



అమరావతి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పేదల గృహ నిర్మాణం కోసం ఉచితంగా ఇసుక ఇవ్వాలని సర్కారు భావిస్తోంది. ఇందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. 2014-19 కాలంలో ఇసుక విధానం ఎలా ఉంది.. పేదలకు ఎలాంటి మేలు జరిగింది.. 2019-24(మే) వరకు ఇసుక అమ్మకాల విధానం ఎలా ఉంది.. ఎవరు లబ్ధిపొందారు.. ప్రభుత్వానికి జరిగిన నష్టం.. పేదలు, గృహ నిర్మాణరంగానికి జరిగిన నష్టమెంతో అంచనా వేయాలని ఆదేశించారు. మంగళవారమిక్కడ సచివాలయంలో గనుల శాఖ ఉన్నతాధికారులతో ఆయన ఇసుకపై సమీక్ష జరిపారు. జగన్ పాలనలో ఇసుక పాలసీ వల్ల పేదలు తీవ్రంగా నష్టపోయారని, గృహనిర్మాణ రంగం కుదేలైందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గృహనిర్మాణ రంగానికి ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇసుక డంప్‌లు వైసీపీ నేతలు, ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్నాయన్న సమాచారం ఉందని, ధరలను భారీగా పెంచి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని సీఎం పేర్కొన్నట్లు తెలిసింది. తక్షణమే ఇసుక ధరలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా రీచ్‌లు, స్టాక్‌పాయింట్లు, డంప్‌ల పరిధిలో ఎంత ఇసుక అందుబాటులో ఉందని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతానికి దాదాపు 40 లక్షల టన్నులు అందుబాటులో ఉందని అధికారులు నివేదించినట్లు తెలిసింది. ఈ ఇసుకను ప్రజలకు అందుబాటులో ఉంచడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలని గనుల శాఖ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను సీఎం ఆరాతీశారు ఇకపై ఆఫ్‌లైన్ ఇసుక అమ్మకాలు జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఉచిత ఇసుకతోపాటు ఇతర అమ్మకాల ద్వారా సరఫరా చేసే ఇసుకను ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకునే విధానం తీసుకురావాలని తేల్చిచెప్పినట్లు తెలిసింది. ఇందుకు అనుగుణంగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి బుధవారం సీఎంకు సమర్పించనున్నారు.

బీఆర్ఎస్‌కు మరో షాక్!

మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్

మర్రి దీపిక కాంగ్రెస్‌లో చేరిక

మేడ్చల్ టౌన్, జూలై 2 : మేడ్చల్‌లో బీఆర్ఎస్ పార్టీకి మరోసారి గట్టి షాక్ తగిలింది. మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీమంత్రి మల్లారెడ్డికి సన్నిహితంగా ఉండే మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపికనర్సింహారెడ్డి, ఆమె భర్త మర్రి నర్సింహారెడ్డి, పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చెరువుకొమ్ము శేఖర్‌గౌడ్, కౌన్సిలర్లు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు గీత మధుకర్‌లతో కలిసి మంగళవారం మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు నక్క ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్లమెంట్ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌కు చెందిన వైస్‌చైర్మన్‌తో సహా 13 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరిన విషయం విదితమే. తాజాగా మిగిలిన ఆరుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లలో ప్రస్తుతం చైర్‌పర్సన్‌తో సహా ముగ్గురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. చైర్‌పర్సన్‌ను వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన కొంతమంది కౌన్సిలర్లకు ఈ పరిణామం ఇబ్బందికరంగా మారింది. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టడానికి గత కొద్ది రోజులుగా ప్రయత్నాలు చేస్తున్న కౌన్సిలర్లకు చెక్ పెట్టడానికే చైర్‌పర్సన్ దీపిక కాంగ్రెస్‌లో చేరినట్టు ప్రచారం జరుగుతోంది. చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి భర్త మర్రి నర్సింహారెడ్డికి మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్‌లతో ఉన్న పరిచయాలు పార్టీ మారేందుకు కలిసొచ్చాయి.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

ఐదుగురు మావోయిస్టుల మృతి

చర్ల, జూలై 2: దండకారణ్యంలో ఎన్‌కౌంటర్ల పరంపర కొనసాగుతూనే ఉంది. వరుస ఘటనల్లో భారీ సంఖ్యలో మావోయిస్టులు మరణిస్తున్నారు. తాజాగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్ అడవుల్లో మంగళవారం ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఘటనా స్థలంలో మావోయిస్టులకు చెందిన తుపాకులు, మందుపాతరలు, ఇతర సామగ్రిని బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు బస్తర్ ఐజీ సుందర్‌రాజన్ తెలిపారు. నారాయణపూర్ జిల్లా ఘమడి, కుర్రేవాయి గ్రామాల పరిధిలో అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టుల సంచారం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దాంతో నారాయణపూర్, కొండెగావ్, కాంకేర్, దంతెవాడ జిల్లాలకు చెందిన డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్ బెటాలియన్ల నుంచి మొత్తం 1,400 మంది జవాన్లు సంయుక్త ఆపరేషన్ చేపట్టారు. నాలుగు జిల్లాల సరిహద్దుల నుంచి అబూజ్‌మడ్‌లోకి ప్రవేశించారు. ఈ క్రమంలో ఘమడి, కుర్రేవాయి గ్రామాల మధ్య మావోయిస్టులు తారసపడడంతో ఇరు పక్షాల నడుమ కాల్పులు చోటుచేసుకున్నాయి. ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. తప్పించుకున్న మావోయిస్టుల కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని ఐజీ తెలిపారు. పోలీసులకు ఎలాంటి గాయాలు కాలేదన్నారు. కాగా, తప్పించుకున్న మావోయిస్టులు అడపాదడపా కాల్పులు జరుపుతున్నట్టు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం గుట్టల్లో ఉండడంతో మృతదేహాల తరలింపు ఆసల్యమవుతున్నట్లు సమాచారం. ఈ ఏడాది జనవరి నుంచి బస్తర్ డివిజన్‌లోని 7 జిల్లాల్లో తుపాకుల మోత మోగుతోంది. వరుస ఘటనలతో బస్తర్. వార్ జోన్‌గా మారింది. ఇప్పటి వరకు జరిగిన 9 ఎన్‌కౌంటర్లలో 136 మంది మావోయిస్టులు మృతిచెందారు. కాగా. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట మంగళవారం ఇద్దరు మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ఒకరు మహిళ, మరొకరు పురుషుడు ఉన్నారు. కుంట ఏరియా కమిటీలో 20 ఏళ్లుగా వీరు పనిచేశారని ఎస్పీ తెలిపారు.

ఈడీ విచారణకు హాజరైన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మంగళవారం ఈడీ విచారణకు హాజరయ్యారు. అక్రమ మైనింగ్ కేసులో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిపై మనీలాండరింగ్ అభియోగాలు ఉన్నాయి. కేసు దర్యాప్తులో భాగంగా విచారణకు హాజరు కావాలని మహిపాల్ రెడ్డికి ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి వెళ్లిన మహిపాల్ రెడ్డి అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. మహిపాల్ రెడ్డిని విచారించిన అధికారులు ఆయన స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, ఆయన సోదరుడు మధుసూధన్ రెడ్డి కలిసి సంతోష్ శాండ్ అండ్ గ్రానైట్ సప్లయ్ అనే సంస్థ ద్వారా అక్రమ మైనింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు సంబంధించి మహిపాల్ రెడ్డి, మధుసూధన్ రెడ్డి ఇళ్లు, కార్యాలయాలు సహా పది చోట్ల జూన్ 20న ఈడీ అధికారులు సోదాలు చేశారు. ఎమ్మెల్యే సోదరులు అక్రమ మైనింగ్‌తో రూ.300 కోట్లు కూడబెట్టారని ఈడీ అధికారులు వెల్లడించిన సంగతి తెలిసిందే.

ఆలయ భూముల కౌలు వేలంలో గందరగోళం

- వేలం కోసం రైతుల ఎదురుచూపులు
- సోమవారానికి వాయిదా వేస్తూ అధికారుల ప్రకటన
- అధికారుల తీరుపై రైతుల అసహనం

దోమ, జూలై 2: మండలంలోని దొంగ ఎన్కెపల్లి శ్రీసంజీవస్వామి ఆలయ భూముల కౌలు వేలంలో గందరగోళం నెలకొంది. మంగళవారం ఈవో సుధాకర్, ఎండోమెంట్ అధికారి మధుబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలంలో ఆయా గ్రామాల రైతులు, ప్రజలు పాల్గొన్నారు. మొత్తం ఆలయానికి 104 ఎకరాల 19గుంటల భూమి ఉన్నప్పటికీ అధికారులు కేవలం గూడూరు గ్రామ పరిధిలో ఉన్న భూములను మాత్రమే వేలం వేసేందుకు ప్రయత్నించారని కౌలు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో 135 సర్వేనెంబర్‌లో ఓ రైతు రూ.1,47,000కు భూమి దక్కించుకోగా ప్రస్తుతం గూడూరు గ్రామానికి చెందిన గప్పలి వీరయ్య అనే రైతు రూ.75వేలకు వేలం


దొంగ ఎన్కెపల్లి శ్రీ సంజీవస్వామి ఆలయం ఆవరణలో వేలంలో పాల్గొన్న రైతులు

దక్కించుకున్నట్లు తెలుస్తోంది. సర్వే నెంబర్ 66లో 14ఎకరాల భూమిని గతంలో రూ.2,40,000లకు వేలం దక్కించుకోగా ప్రస్తుతం కొత్తూర్ రమేశ్ రూ.1,50,000వేలకు వేలాన్ని దక్కించుకున్నట్లు సమాచారం. సర్వే నెంబరు 173, 174లో 20.15 గుంటల భూమి ఉండగా గతంలో రూ.90వేలకు వేలం దక్కించుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. మొత్తంగా వేలంలో అధికారుల తీరుపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పారదర్శకంగా వేలాన్ని నిర్వహించాల్సింది పోయి కేవలం వారికి అనుకూలంగా ఉన్న వారు మాత్రమే వేలంలో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వేలం వేయకుండానే వేలం వేసినట్లు చెప్పి అధికారులు తప్పించుకునేందుకు ప్రయత్నాలు చేసినట్లు ఆయా గ్రామాల రైతులు ఆరోపించారు. దీంతో వేలం కోసం రోజంతా నిరీక్షించాలమంటూ పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఆలయ భూముల కౌలు వేలాన్ని పారదర్శకంగా నిర్వహించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై ఈవో సుధాకర్‌ను వివరణ కోరగా ఆలయ భూముల వేలం పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. సరైన పాట రాకపోవడంతో వాయిదా వేశామని తెలిపారు. ఏ రైతు వేలంలో పాల్గొనలేదని, హాజరైన రైతులు వేలంలో పాల్గొనేందుకు దూరంగా ఉన్నారని, దీంతో సోమవారానికి వాయిదా వేశామని తెలిపారు.


ర్యాలీలో భాగంగా మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

వికారాబాద్, జూలై 2: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వికారాబాద్ పట్టణంలో మంగళవారం వివిధ శాఖల అధికారులతో కలిసి విద్యార్థులకు మత్తుపదార్థాల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి వాటికి యువత దూరంగా ఉండాలని సూచించారు. వాటి వల్ల జీవితాలు నాశనమవుతాయని, తల్లిదండ్రుల ఆశలు ఆవిరవుతాయని అన్నారు. ప్రతీ ఒక్కరు వీటిపై అవగాహన కలిగి ఉండి మన చుట్టూ జరిగే వాటిని గమనిస్తూ ఉండాలన్నారు. చేడుస్నేహం ఒక జీవితాన్ని, ఒక కుటుంబాన్ని నాశనం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పెండ నర్సింహులను పరామర్శిస్తున్న రవీందర్ గౌడ్

సహకార సంఘం డైరెక్టర్‌కు పరామర్శ

తాండూరు రూరల్, జూలై 2: గాయపడిన సహకార సంఘం డైరెక్టర్‌ను ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ రవీందర్‌గౌడ్ మంగళవారం పరామర్శించారు. మండలంలోని అంతారం గ్రామానికి చెందిన పెండ నర్సింహులు తాండూరులోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నాడు. నాలుగు రోజుల కిందట ఆస్పత్రిలో విధులు ముగించుకుని తిరిగి బైక్‌పై వస్తుండగా కుక్క అడ్డువచ్చి పడటంతో నర్సింహులుకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ రవీందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ వడ్డె శ్రీనివాస్, నర్సింహులు ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్థిక సాయాన్ని అందజేశారు. వారి వెంట ఎంపీటీసీ శాంతు, గ్రామపెద్దలు కోస్గి ఆశన్న, మొగులప్ప, పుల్లప్ప, విశాల్, శ్రీనివాస్, ప్రకాష్, యేసు పాల్గొన్నారు.


చోటాజానీకి ఎల్వోసీ అందజేస్తున్న సబితాఇంద్రారెడ్డి

సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

కందుకూరు, జూలై 2: వైద్య సేవలకోసం ఆర్థిక స్థోమత లేని నిరుపేదలు సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని కొత్తగూడ గ్రామానికి చెందిన ఎండీ జెబాబేగం కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మంగళవారం సీఎంఆర్ఎఫ్ కింద మంజూరుచేసిన రూ.లక్షా 50వేల ఎల్వోసీని జెబాబేగం కుటుంబ సభ్యులైన చోటాజానీకి అందజేశారు. నాయకులు ఆర్.యాదయ్య, కాసుల రామకృష్ణారెడ్డి, ఎండీ అహ్మద్, జైత్వారం ఎంపీటీసీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బక్కని నర్సింహులు

కేటీఆర్ మాటలు హాస్యాస్పదం : బక్కని

షాద్‌నగర్ రూరల్, జూలై 2: పార్టీలు మారుతున్న ఎమ్మెల్యేలు రాజీనామా చేసి మళ్లీ గెలవాలని మాజీ మంత్రి కేటీఆర్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు ఎద్దేవా చేశారు. ఫరూఖ్‌నగర్ మండలం కొండన్నగూడలో మంగళవారం టీడీపీ జెండా పండుగ కార్యక్రమంలో భాగంగా పార్టీ జెండాను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ నుంచి గెలిచిన 15 మంది ఎమ్మెల్యేలను టీఆర్ఎస్‌లో చేర్చుకున్నపు నిజాయితీ ఎక్కడికి పోయిందన్నారు. టీడీపీ ఇతర పార్టీలు విలీనమయ్యాయని కేటీఆర్ అంటున్నారని, ఆనాడు ఎర్రబెల్లి దయాకర్‌రావు, కడియం శ్రీహరిలు విలీనం చేయడానికి పార్టీ అధ్యక్షులా? అని ప్రశ్నించారు. టీడీపీ నుంచి గెలిచిన సత్తుపల్లి, అశ్వారావుపేట ఎమ్మెల్యేలను రాజీనామా చేయించి తమ పార్టీలో చేర్చుకున్నారా? అని అన్నారు. స్వార్థబుద్ధితో ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి లబ్ధిపొందిన వారు రాజనీతి గురించి మాట్లాడటం విచిత్రంగా ఉందన్నారు. రాజకీయ నాయకులు హుందాగా మాట్లాడే సాంప్రదాయాన్ని నాశనం చేసింది మీరేనన్నారు. పార్టీలు మారడం వల్ల రాజకీయాల మీద గౌరవం తగ్గిందని తెలిపారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ పేద ప్రజల సంక్షేమం కోసం ఎంతో కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి గందం ఆనంద్, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యా సంస్థల బంద్

ఘట్‌కేసర్, జూలై 2: నీట్ పేపర్ లీకేజీకి నిరసనగా గురువారం (రేపు) నిర్వహించనున్న దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఘట్‌కేసర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి నానావత్ శివాజీనాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్, వినయ్ మాట్లాడారు. నీట్ పరీక్షా పేపర్‌ను లీక్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈవిషయమై తక్షణమే సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ 11 విద్యార్థి సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. అనంతరం బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎట్టకేలకు కదిలిన యంత్రాంగం

- తాండూరు చిలుక వాగు కబ్జాపై ఎమ్మెల్యే సీరియస్
- రంగంలోకి దిగిన అధికారులు
- తాండూరులో తొలిసారి మూడు శాఖల సంయుక్త సర్వే


సయుక్తంగా సర్వే చేపట్టిన అధికారులు


కబ్జాకు గురైన తాండూరు చిలుక వాగును పరిశీలిస్తున్న అధికారులు

తాండూరు, జూలై 2: తాండూరు మున్సిపాలిటీ పరిధిలో లోతట్టు ప్రాంతాలైన చిలుకవాగు కబ్జాలపై అధికార యంత్రాంగం కదిలింది. తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఈ కబ్జాలపై సమీక్షించి సీరియస్‌గా స్పందించారు. 'మీకు ఫుల్ పవర్ ఇస్తున్నా ఎవరికి లొంగ వద్దు, మీ పని మీరు చేసుకొండి..' అంటూ ఎమ్మెల్యే అధికారులతో చెప్పారు. దీంతో మంగళవారం ఉదయం రెవెన్యూ, మున్సిపల్, ఆర్అండ్‌బీ అధికారుల బృందం చిలుకవాగు కబ్జాపై సర్వేకు సిద్ధమై రంగంలో దిగారు. దాదాపు రెండు కిలోమీటర్ల మేర అధికారులు, ప్రజాప్రతినిధుల బృందం పొలాలు, కాల్వ వెంబడి వెళ్లి కబ్జాకు గురైన ప్రాంతానికి పూర్తిగా క్షేత్రస్థాయిలో పరిశీలించి గుర్తించారు. హైదరాబాద్ రోడ్డు మార్గంలోనున్న కల్వర్టు నుంచి కోకట్, కొడంగల్ రోడ్డు మార్గం పోనున్న చిలుక వాగు వరకు అధికారుల బృందం సర్వే చేపట్టింది. తాండూరు మున్సిపల్ చరిత్రలోనే మూడు శాఖలు సంయుక్తంగా సర్వే చేపట్టడం ఇదే తొలిసారి. ప్రధాన సమస్యగా ఉన్న తాండూరు-హైదరాబాద్ రోడ్డు మార్గం యాలాల మండల పరిధిలోకి వస్తుండడంతో సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులు రాకపోవడంతో అక్కడ పరిశీలన ఆగిపోయింది. ఎక్కడెక్కడ కబ్జాలున్నాయి? నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న వాటి తొలగింపునకు సంబంధించి మూడు శాఖల అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. దాదాపు మూడున్నర గంటల పాటు ఈ పరిశీలన కొనసాగింది. పాతకుంట ఏరియాలోని కాల్వలను జేసీబీ సాయంతో శుభ్రం చేయించారు. పరిశీలనలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ, కమిషనర్ విక్రం సింహారెడ్డి, ఇన్‌చార్జి డీఈఈ ఖాజా హుసెన్, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ అధికారులు ఉన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

భూ దందాల కోసమే కాంగ్రెస్‌లో చేరిన యాదయ్య

- మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం డిమాండ్

చేవెళ్ల, జూలై 2 : పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అక్రమంగా సంపాదించిన ఆస్తులు కాపాడుకునేందుకు, భూ దందాల కోసమే చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్‌లో చేరారని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ధ్వజమెత్తారు. మంగళవారం పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే యాదయ్య బీఆర్ఎస్ నుంచి గెలిచిన కొన్నాళ్లకే అధికార కాంగ్రెస్‌లో చేరడం సిగ్గుచేటన్నారు. మొన్నటి వరకు సీఎం కేసీఆర్ కాళ్లు మొక్కిన యాదయ్య చరిత్ర ఏంటీ.. ఆయన బతుకు ఏంటీ.. తిరుపతి లడ్డూలు అమ్ముకున్న విషయం ప్రజలందకీ తెలుసు అని మండిపడ్డారు. అధికారం లేకుండా ఒక్క క్షణం కూడా ఉండలేరని ఎద్దేవా చేశారు. గతంలో కాంగ్రెస్‌లో గెలిచి బీఆర్ఎస్‌లోకి.. ఇప్పుడు బీఆర్ఎస్‌లో గెలిచి అధికార దాహంతో కాంగ్రెస్‌లో చేరాడని, ఆయనకు నిజంగా సిగ్గు, శరం లేదన్నారు. యాదయ్య రాజకీయం చేసేకంటే బ్రోకర్‌గిరి చేస్తే బాగుంటుందని సలహా చేశారు. రంగారెడ్డి జిల్లాలో యాదయ్య దళితుల పరువు తీస్తున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దొంగలను పార్టీలో చేర్చుకుంటే.. మీరు కూడా దొంగలవుతారన్నారు. రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలతోనే చేవెళ్లలో కాంగ్రెస్ ఓడిపోయిందన్నారు. సీఎం కేసీఆర్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందన్నారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన యాదయ్య చేవెళ్ల ప్రజలకు క్షమాపణ చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా కార్యదర్శులు వెంకటొరెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, అంజనేయులు, మండల ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, బీజేవైఎం మండలాధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు శ్రీనివాస్, కృష్ణారెడ్డి, రవీందర్, కృష్ణమోహన్, తదితరులు ఉన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషిచేయాలి

- జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్

వికారాబాద్, జూలై 2: ఇంటర్మీడియట్ పరీక్షల్లో 100శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రిన్సిపాల్స్ కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి ఎస్.శంకర్ అన్నారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి కార్యాలయంలో నిర్వహించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధితోనే లక్ష్యాలను సాధించవచ్చన్నారు. ప్రతీవిద్యార్థి తెలుగు అకాడమి పుస్తకాలు చదివేలా ప్రోత్సహించాలన్నారు. అకాడమి పుస్తకాలు చదివే విద్యార్థులే పోటీపరీక్షల్లో రాణిస్తారని అన్నారు. బ్యాక్ లాగ్ సబ్జెక్టులు ఉన్న


మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్

విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. విద్యార్థులకు ఒత్తిడిలేని విద్య అందించాలని సూచించారు. వార్షిక పరీక్షల ఫలితాలను కళాశాలల వారీగా సమీక్షించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు ఎప్‌సెట్, ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసినప్పుడే వారు భవిష్యత్తులో రాణిస్తారని అన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్స్ తమ కళాశాలల్లో ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా ఇంటర్ విద్యాధికారికి వివరించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్స్ రాజ్ మోహన్, చెన్నయ్య, నర్సింహారెడ్డి, కుమారస్వామి, శోభారాణి, సురేశ్వరస్వామి, మంజుల, నర్సింహులు, కార్యాలయ సిబ్బంది వినోద్, సలీమా బేగం, ఇందిరమ్మ పాల్గొన్నారు.

ముమ్మరంగా కలుపుతీత పనులు

- బిజీబిజీగా రైతులు

పెద్దేముల్, జూలై 2: మండలంలోని వ్యవసాయ పొలాల్లో కలుపు నివారణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రైతులు వ్యవసాయ పొలాల్లో బిజీబిజీగా మారారు. మండలంలో వర్షాకాలం ఆరంభంలో వర్షాలు జోరుగా కురిసాయి. వేసవి కాలంలోనే దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్న పొలాల్లో రైతులు తొలకరి వర్షాలకు పంటలు విత్తుకున్నారు. కొందరు రైతులు తొలకరి వర్షాలకు పంటచివరి దుక్కులు చేసి పంటలు విత్తుకున్నారు. పంటలు విత్తుకున్న తర్వాత వరుణుడు ముఖం చాటేశాడు. పంటలు విత్తుకున్నాక సుమారు 15 నుంచి 20 రోజులు వర్షాలు కురవలేదు. దీంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. విత్తనాలు మొలుస్తాయో? లేదో? మొలిచిన మొలక నిలబడుతుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో వరుణుడు కరుణించాలని పూజలు


జనగాం గ్రామశివారు పొలాల్లో కలుపు తీస్తున్న మహిళలు

చేస్తున్నారు. ఇంతలో మూడురోజుల కిందట వర్షాలు కురవడంతో రైతులు పొలం బాటపట్టారు. సస్యరక్షణ చర్యలు చేపట్టారు. కూలీల చేత పంటపొలంలో కలుపు తీయిస్తున్నారు. పత్తిమొలకలకు ఎరువులు వేస్తూ ఎక్కడ చూసినా వ్యవసాయ పొలాల్లో రైతులు బిజీగా కనిపిస్తున్నారు.


కలెక్టర్ శశాంకతో చర్చిస్తున్న ఎమ్మెల్యే శంకర్

సిద్ధాపూర్ భూములపై విచారణ చేయండి

- కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, జూలై 2: కొత్తూర్ మండలంలోని సిద్ధాపూర్ గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ భూములపై విచారణ చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కలెక్టర్ శశాంకను కోరారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో సమస్యలపై కలెక్టర్‌తో చర్చించి, వినతిపత్రాన్ని ఇచ్చారు. సిద్ధాపూర్ ప్రభుత్వ భూములను సర్వే చేయించి, అవకతవకలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమార్కులపై చర్యలు తీసుకుని, బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరారు. పేదల ఇళ్ల నిర్మాణం, ఆట స్థలం కోసం 15 నుంచి 20 ఎకరాల భూమిని కేటాయించాలని కోరారు. కొందుర్గు మండల కేంద్రంలో స్టేడియం నిర్మాణానికి, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు భూమిని కేటాయించాలని కోరారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్దిదారుల ఎంపికలో గత ప్రభుత్వం నిబంధనలను పక్కనపెట్టి, అవకతవకలకు పాల్పడిందని కలెక్టర్‌కు తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కోసం నిబంధనల ప్రకారం నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని శంకర్ కలెక్టర్‌ను కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునీకరించండి

ఆమనగల్లు, జూలై 2 : నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునీకరించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని రాష్ట్ర వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణానికి అదనంగా మరో రూ.10 కోట్లు కేటాయించి పనులు త్వరితగతిన చేపట్టేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు రాజనర్సింహను మంగళవారం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీసింగ్‌తో కలిసి ఎమ్మెల్యే నగరంలో కలిశారు. కల్వకుర్తి, ఆమనగల్లు, కడ్తాల, వెల్దండ, తలకొండపల్లి, మాడ్గుల మండల కేంద్రాల్లో అన్ని ఆసుపత్రులను ఆధునాతన సదుపాయాలతో తీర్చిదిద్దాలని కోరినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. వెల్దండ మండల కేంద్రంలో 30 పడకల పీహెచ్‌సీని ఏర్పాటుచేసి అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. తలకొండపల్లి, గట్టిప్పలపల్లి, మాడ్గుల, ఇర్విన్ ఆసుపత్రి భవనాలను ఆధునీకరించి ఖాళీగా ఉన్న వైద్యసిబ్బంది పోస్టులు భర్తీ చేయాలని మంత్రికి విన్నవించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమస్యల పరిష్కారంపై మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు భూపతిరెడ్డి, ఆనంద్, తదితరులున్నారు.


మంత్రి రాజనర్సింహకు వినతిపత్రం అందజేస్తున్న కసిరెడ్డి నారాయణరెడ్డి

పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధి


శంకుస్థాపన చేస్తున్న జడ్పీటీసీ దశరథ్ నాయక్

కడ్తాల్, జూలై 2: పట్టణాలకు దీటుగా పల్లెలు, గిరిజన తండాల్లో మౌలిక వసతులను కల్పించి అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటీ సభ్యుడు, జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. గ్రామాలు, గిరిజన తండాలలో ప్రజలకు మెరుగైన మౌళిక వసతుల కల్పనకు ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలు రూపొందించి అమలు చేయాలని కోరారు. కడ్తాల మండలం సాలార్‌పూర్‌లో రూ.5లక్షల జడ్పీ నిధులతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణం పనులకు మంగళవారం ఎంపీటీసీ ప్రియరమేశ్‌తో కలిసి జడ్పీటీసీ శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పదవీ కాలంలో కడ్తాల మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి ప్రజల ఇబ్బందులు తీర్చామన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించి వినియోగంలోకి తేవాలని దశరథ్ నాయక్ కోరారు. కొత్తగా ఏర్పడ్డ అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాల్వలు నిర్మించాలన్నారు. మాజీ ఎంపీపీ సువాలిపంతూ, మాజీ సర్పంచ్ హరిచంద్ నాయక్, నాయకులు బాబా, కుమార్, రాజు, అంజయ్య, జైపాల్, గోపాల్, అనిల్, శ్రీరాములు, శ్రీను, రమేశ్, ఈశ్వరప్ప, తదితరులు పాల్గొన్నారు.



ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ కాంప్లెక్స్ ను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

రైతులకు మేలు చేయాలి

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

రాజేంద్రనగర్, జూలై2 : భూసార పరీక్షలతో పాటు, విత్తన ధ్రువీకరణ పరీక్షలు, ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్‌కు సంబంధించిన అన్ని పరీక్షలు నాణ్యతగా చేసి రైతులకు ఉపయోగపడే విధంగా చూడాలని, ఇంటిగ్రేటెడ్ ల్యాబ్స్ కాంప్లెక్స్‌లో మొక్కలను పెంచి సంరక్షించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. రాజేంద్రనగర్ లో రూ.7.9కోట్లతో నూతనంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ కాంప్లెక్స్‌ను మంగళవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.రఘునందన్‌రావు, వ్యవసాయ శాఖ కమిషనర్ బి.గోపి, అడిషనల్ డైరెక్టర్ విజయ్‌కుమార్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక, రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారిణి గీతారెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల సమస్యల పరిష్కారానికి కృషి

దౌల్తాబాద్, జూలై 2: మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, ఐద్వా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో అరుణ జ్యోతి మాట్లాడుతూ.. భ్రూణ హత్యలు, మహిళలపై వేధింపులు, అఘాయిత్యాలు హేయమైన చర్యలని అన్నారు. మహిళలు చైతన్యమై ఇలాంటి సంఘటనలకు పాల్పడుతున్న మానవ మృగాలను కట్టడి చేయాల్సిన అవసరముందన్నారు. అనంతరం సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా సవిత, కార్యదర్శిగా విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా భారతమ్మ, సహాయ కార్యదర్శిగా భీమమ్మలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరు బాధాకరం: ఎంపీపీ

శంకర్‌పల్లి, జూలై 2: కొందరు అధికారుల తీరు చూస్తే చాలా బాధేసిందని, ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నదే ప్రజలకు సేవ చేయడానికని ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ తాను ఎంపీపీగా పనిచేసిన రోజులు ఎంతో సంతృప్తినిచ్చాయన్నారు. కాగా, తనకు సహకరించక ఫోన్ ఎత్తకుండా, పనులు చేసేందుకు తప్పించుకున్న అధికారులు ఇద్దరు ఉన్నారని.. వారే ఇన్‌చార్జి ఎంఈవో అక్బర్, పంచాయతీ రాజ్ ఏఈ యుగేందర్‌లు అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఈవో వ్యవహార శైలితో మండలంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్థంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫోన్ చేస్తే ఎత్తకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించేవాడని అన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో అక్బర్‌పై నిండు సభలో ధ్వజమెత్తారు. పంచాయతీ రాజ్ ఏఈ సైతం ఫోన్ ఎత్తకుండా, చేసిన పనులకు రికార్డులు తయారు చేయకుండా ఇబ్బందులకు గురిచేశాడని ఆవేదన వ్యక్తం చేశాడు. తాను చదువుకున్న వాడినని, చేతకాని వాడిని కానని.. క్రమశిక్షణ అడ్డు వచ్చిందని తీవ్ర ఉద్వేగానికి లోనయ్యారు. అంతకుముందు విద్యాశాఖపై సమీక్ష జరుగుతుండగా సమావేశానికి ఇన్‌చార్జి ఎంఈవో రాకపోవడంతో సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఈవో ఇలాగే కొనసాగితే విద్యా వ్యవస్థ నాశనమవుతుందని పర్వేద, జన్వాడ, కొండకల్ ఎంపీటీసీలు వెంకటొరెడ్డి,


ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీడీవో వెంకయ్యగౌడ్

నాగేందర్, సురేందర్‌రెడ్డిలు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, రోడ్లు, భవనాలు, సాంఘిక సంక్షేమం, రోడ్డు రవాణా, ఎక్సైజ్, ఇరిగేషన్, పరిశ్రమలు, ఉద్యానవన, పౌరసరఫరాల శాఖల అధికారులు హాజరు కాలేదు. ఎంపీటీసీల పదవీకాలం రెండు రోజుల్లో ముగుస్తున్నందున వారందరూ హాజరుకాలేదేమోనని గుసగుసలు వినిపించాయి. ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులకు మండల పరిషత్ కార్యాలయం తరఫున శాలువాలతో సత్కరించారు. ఎంపీడీవో వెంకయ్యగౌడ్, వైస్ ఎంపీపీ ప్రవళిక వెంకటొరెడ్డి, తదితరులున్నారు.

నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలి

● బీజేపీ, బీజేవైఎం నాయకులు ● నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేత

చేవెళ్ల : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేసి నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. బీజేవైఎం పిలుపు మేరకు మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ, బీజెవైఎం నాయకులతో కలిసి రత్నం ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ కృష్ణయ్యకు పలు డిమాండ్లతో కూడాని వినతిపత్రం అందించారు. రత్నం మాట్లాడుతూ గ్రూప్-1, 2, 3 పోస్టులను పెంచి నోటిఫికేషన్ వేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం డీఎస్సీ పరీక్షల తేదీలను వాయిదా వేసి మెగా డీఎస్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీజేపీ మండల ప్రదాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆంజనేయులుగౌడ్, సీనియర్ నాయకులు అడేట్ల శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కృష్ణాగౌడ్, ఓబీసీ అధ్యక్షుడు అభిషేక్‌రెడ్డి, దళితమోర్చా అధ్యక్షుడు ఆశోక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ అర్బన్ : అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తూ, నిరుద్యోగ భృతిని ఇస్తామని.. అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిరుద్యోగులను మోసగించిందంటూ బీజేపీ, బీజేవైఎం నాయకులు నిరసన చేపట్టారు. బీజేవైఎం పిలుపు మేరకు యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి ప్యాట అశోక్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ చౌరస్తాలో నిర్వహించిన నిరసనలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, వినతిత్రతం ఇచ్చారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, బాబయ్యలతో పాటు ప్యాట అశోక్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు హరిభూషన్‌లు మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం 25వేల పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలని, గ్రూప్-1 ప్రిలిమ్‌లో 1:100 నిష్పత్తి ప్రకారం క్వాలీఫై చేయాలని, గ్రూప్-2, గ్రూప్-3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులను పెంచాలని, డీఎస్సీ తేదీ గడువును పెంచాలని, 33శాతం మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు చెట్ల వెంకటేష్, ఎం. మురళీ, మఠం రుషీకేష్, శ్రీనివాసచారి, పి. సాయికుమార్, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.


షాద్‌నగర్ అర్బన్ : షాద్‌నగర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు

కొత్తూర్ : నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపాలిటీ, మండల బీజేపీ అధ్యక్షుడులు ఎర్రవెల్లి నాగరాజుచారి, మంగలి రమేష్ ఆధ్వర్యంలో నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి తహసీల్దార్ రవీందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు బావండ్ల మాణిక్యం, శ్రీశైలం, అంబటి శ్రీశైలం, రణధీర్‌గౌడ్, ప్రశాంత్, శివ, తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గు : ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలాచారి డిమాండ్ చేశారు. ఈమేరకు మండల తహసీల్దార్‌కు నిరుద్యోగం, జాబ్‌క్యాలెండర్ అంశాలపై వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగులకు ఎలాంటి ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని, ఇచ్చిన నోటిఫికేషన్లలో అవకతవకలతో నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని విమర్శించారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీజేవైఎం మండల అధ్యక్షులు యాదయ్య, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీశైలం, నాయకులు బోయ శంకర్, బలవంత్‌రెడ్డి, ఈ సత్యనారాయణ, బి.అశోక్, ఎస్.యాదయ్య, కిరణ్, శ్రీను, లింగం, యాదయ్య, మధు, సాయిరాం, శివకుమార్, రాజు, వినోద్, సత్యయ్య తదితరులున్నారు.

కడ్తాల్ : నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ బీజేవైఎం ఆధ్వర్యంలో మంగళవారం కడ్తాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బీజేవైఎం కడ్తాల మండల ఉపాధ్యక్షుడు మధుసూదన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేవైఎం, ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగ యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి కాంటేకార్ భగీరథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తహసీల్దార్ ముంతాజ్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఇచ్చారు. బీజేపీ మండలాధ్యక్షుడు మన్యనాయక్, బీజేవైఎం నాయకులు మధుసూధన్, కృష్ణ, తదితరులున్నారు.

షాబాద్ : నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని బీజేవైఎం స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మహేందర్ అన్నారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేవైఎం మండల అధ్యక్షుడు మహేష్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ మధుకు వినతిపత్రం అందజేశారు. అన్ని నియామకాల్లో మహిళా అభ్యర్థులకు 33శాతం రిజర్వేషన్‌ను కేటాయించాలన్నారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు కిరణ్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి మాణెయ్య, నాయకులు రవీందర్‌రెడ్డి, హరీష్ రవిగౌడ్, అనంతం, దయాకర్, రాఘవేందర్, విక్రమ్, శ్రీనివాస్, ఉపేందర్‌రెడ్డి, తదితరులున్నారు.

యాచారం : జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, యువతకు ఉపాధి కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ మండలాధ్యక్షుడు తాండ్ర రవీందర్ అన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని కోరుతూ బీజేవైఎం కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ అయ్యప్పకు వినతిపత్రం అందించారు. 25వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, 46జీవోను తక్షణమే రద్దు చేయాలని కోరారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీధర్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి నడికూడి కృష్ణ, బీజేవైఎం నాయకులు బీరప్ప, శ్రీనాథ్, శివమోడీ, శ్రీకాంత్, శివ తదితరులున్నారు.

మహేశ్వరం : నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో నాడు బీఆర్ఎస్, నేడు కాంగ్రెస్ ప్రభుత్వాలు పూర్తిగా వివక్ష చూపిస్తున్నట్లు బీజేవైఎం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు యాదీష్ ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగులు సమస్యలు పరిష్కరించాలని, జాబ్ క్యాలండర్ విడుదల చేయాలని కోరుతూ తహసీల్దార్ విజయలక్ష్మీకి పార్టీ నేతలతో కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఎలాంటి జాబ్ నోటిఫికేషన్ వేయకుండా అన్యాయం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7నెలలు గడిచినా జాబ్ క్యాలండర్ విడుదల చేయకుండా నామమాత్రపు పోస్టులు భర్తీ చేస్తోందన్నారు. 25వేల ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ వేయాలన్నారు. బీజేవైఎం నాయకులు శ్రవణ్, బి.రఘుగౌడ్, మహేష్, సుదర్శన్, దేవేందర్, బి.సాయిలు, శివప్రకాష్, ప్రకాష్‌తో పాటు బీజేపీకి చెందిన వివిధ మోర్చాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి : మెగా డీఎస్సీని నిర్వహించి 25 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలని, జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. తహసీల్దార్ రంగారెడ్డికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి నీలకంఠ పాండు, అసెంబ్లీ కన్వీనర్ పద్మ అనిల్, నాయకులు పోతుగంటి మహేశ్, కృష్ణ, కుమార్, కిరణ్, మహేశ్, రాము, తదితరులున్నారు.


చేవెళ్ల : తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, నాయకులు


మహేశ్వరం: తహసీల్దార్ విజయలక్ష్మీకి వినతిపత్రం ఇస్తున్న బీజేవైఎం నాయకులు

'రైతు భరోసా'పై నేడు ప్రజాభిప్రాయ సేకరణ

తలకొండపల్లి, జూలై 2: రైతు భరోసా పథకం అమలుపై పీఏసీఎస్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తలకొండపల్లి పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు వెంకటాపూర్‌గేటు సమీపంలోని ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల రైతులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొనాలని కోరారు.

మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు


నల్లకంచెలో వనమహోత్సవం కోసం తీస్తున్న గుంతలను పరిశీలిస్తున్న ఎంపీపీ కృపేష్

ఇబ్రహీంపట్నం, జూలై 2: ఇబ్రహీంపట్నంలోని నల్లకంచెలో వనమహోత్సవం కింద రెండు వేల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీపీ కృపేష్, ఎంపీడీవో వెంకటమ్మలు తెలిపారు. మంగళవారం వారు ఉపాధి హామీ పథకం కింద తీస్తున్న గుంతలను పరిశీలించారు. మండలంలో మొత్తం 84 వేల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తామన్నామన్నారు. వీరి వెంట ఉపాధి హామీ పథకం ఏపీవో తిరుపతాచారి ఉన్నారు.

ఎస్సై శ్రీనివాసులుకు సన్మానం

ఆమనగల్లు, జూలై 2: ఆమనగల్లు ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులును మంగళవారం కాంగ్రెస్ జిల్లా నాయకుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈమేరకు పోలీస్ స్టేషన్‌లో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల అదుపుకు ప్రజలంతా పోలీసులకు సహకరించాలని ఎస్సై కోరారు.


శ్రీనివాసులును సన్మానిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

రూ.12.90 కోట్లతో అభివృద్ధి పనులు

ఇబ్రహీంపట్నం, జూలై 2: తుర్కగూడ, కప్పాడు గ్రామాల్లో ఐదేళ్ల కాలంలో రూ.12.90 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టామని ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు ఏనుగు భరత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఇబ్రహీంపట్నంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సహకారంతో రూ.4.76 కోట్లతో తుర్కగూడ నుంచి పోచారం మీదుగా కొంగరకలాన్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టామని, కప్పాడులో రూ.25లక్షల వ్యయంతో గ్రామ పంచాయతీ నూతన భవనం, తుర్కగూడ-ఎర్రగుంటల మధ్య రూ.25 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేశామన్నారు. రూ.15 లక్షల వ్యయంతో వడ్డెర సంఘం భవనాన్ని నిర్మించామన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నీళ్లిచ్చామని, సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులకు ప్రాధాన్యతనిచ్చామన్నారు.


మాట్లాడుతున్న ఎంపీటీసీ భరత్‌రెడ్డి

వేతనాలు సకాలంలో చెల్లించాలి


ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న నర్సింహారెడ్డి

చౌదరిగూడ, జూలై 2: పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి కోరారు. మంగళవారం చౌదరిగూడ మండల పరిషత్ కార్యాలయంలో వేతనాలు సకాలంలో చెల్లించాలని కోరుతూ ఎంపీడీవోకు పంచాయతీ కార్మికులతో కలిసి వినతిపత్రం అందించారు. కార్మికులకు రూ.21వేలు, కారోబార్లకు రూ.26వేల వేతనం ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. కార్మికులను కార్యదర్శులు వేధింపులకు గురిచేయవద్దని వేడుకున్నారు. సీపీఐ మండల కార్యదర్శి జిల్లెల్ల వెంకటేష్, రమేష్, వీరేశ్, ఈదమ్మ, గోపాల్, పాపయ్య, జంగయ్య, చంద్రమ్మ, రమేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

పది ఎకరాల్లోపు ఉన్నవారికే 'రైతు భరోసా' వర్తింపజేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ చంద్రశేఖర్

కందుకూరు, జూలై 2: పది ఎకరాల లోపు వ్యవసాయ భూమి ఉన్నవారికే రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించాలని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. మంగళవారం మండల సహకార సంఘం చైర్మన్ డి.చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు. 20 ఎకరాల వరకు పంట సాగుచేసే రైతులకు, కౌలు రైతులకు రైతు భరోసా పథకాన్ని వర్తింపజేయాలని లేమూరు రైతులు రాజా ప్రతాప్‌రెడ్డి, ఎలుక మేఘనాథ్‌రెడ్డిలు తెలిపారు. గ్రామాల్లో పామ్‌ల్యాండ్ ప్లాట్లుగా మార్చిన భూములకు, గుట్టలు, రాళ్ల ఉన్న భూములను సాయం వర్తింపజేయరాదని నేదునూరు రైతు జి.సురేందర్‌రెడ్డి తెలిపారు. జాతీయ ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని కందుకూరు, తిమ్మాపురం రైతులు దేశం కృష్ణారెడ్డి, గంగాపురం గోపాల్‌రెడ్డిలు కోరారు. రైతుల సూచనలు, సలహాలను జిల్లా సహకార సంఘం పాలక వర్గం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు మహేశ్వరం ఏడీఏ సుజాత, మండల సహకార సంఘం చైర్మన్ డి.చంద్రశేఖర్‌లు తెలిపారు. ఎంపీపీ జ్యోతి, వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, సహకార సంఘం వైస్ చైర్మన్ జి.విజయేందర్‌రెడ్డి, డైరెక్టర్లు శేఖర్‌రెడ్డి, నర్సింహ, జి.పర్వతాలు, జి.అంజమ్మ, జి.వెంకటేష్, కె.యశోద, వెంకటరామిరెడ్డి, పాండురంగారెడ్డి, పొట్టి ఆనంద్, ఎంపీటీసీలు కాకి రాములు, బి.మల్లేష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవలందిస్తేనే ఆదరణ : ఎంపీపీ


మాట్లాడుతున్న ఎంపీపీ సుకన్యబాషా

యాచారం, జూలై 2: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తేనే గ్రామాల ప్రగతి సాధ్యమని, ప్రజలకు మెరుగైన సేవలందిస్తేనే ఆదరిస్తారని ఎంపీపీ కొప్పు సుకన్యబాషా అన్నారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో వివిధ గ్రామాల ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో ఎంపీపీ పాల్గొని మాట్లాడుతూ కరోనా సమయంలో అధికారులు ఎంతో సహకారమందించారని గుర్తుచేశారు. ఎంపీడీవో వినయ్‌కుమార్, నరేందర్‌రెడ్డి, విజయలక్ష్మిలు తాను పురమాయించిన ప్రతీ పనిని చేసి ప్రజల చేత ప్రశంసలందుకునేట్లు తోడ్పాటునందించారని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు తనకెంతో సహకారమందించారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పని చేయడంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి చెప్పారు. అనంతరం వైస్ ఎంపీపీలతో పాటు ఎంపీటీసీలను ఎంపీపీ సత్కరించి జ్ఞాపికలు అందించారు. తహసీల్దార్ అయ్యప్ప, మాజీ ఎంపీడీవో విజయలక్ష్మి, పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాస్ రెడ్డి, ఏఈ ఉస్మాన్, వ్యవసాయశాఖాధికారి సందీప్‌కుమార్, ఏఈవో గురుప్రసాద్, ఎంపీవో శ్రీలతలతో పాటు ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

ఎంపీపీ ఉదారత.. నాలుగు వందల కుర్చీల వితరణ


కుర్చీలు అందిస్తున్న మధుసూదన్‌రెడ్డి

కొత్తూర్, జూలై 2: ప్రభుత్వ కార్యాలయాలతో పాటు, గ్రామ పంచాయతీలకు ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి సొంత ఖర్చుతో నాలుగు వందల కుర్చీలు అందజేసి ఉదారత చాటుకున్నాడు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు, ఆయా గ్రామపంచాయతీలకు కుర్చీల కొరతను గుర్తించిన ఎంపీపీ వేలాది రుపాయలు వెచ్చింది కొనుగోలు చేసి పంపిణీ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయానికి మంగళవారం 50కుర్చీలను అందజేశారు. ఎంపీపీకి పలువురు అధికారులతో పాటు, ఆయా గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీడీవో అరుంధతి, నాయకులు అంబటి ప్రభాకర్, ఎల్లారం శేఖర్‌రెడ్డి, రవినాయక్, తదితరులున్నారు.

ఎమ్మెల్యే యాదయ్యకు నాయకులు శుభాకాంక్షలు



షాబాద్, జూలై 2 : ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మంగళవారం నాగర్‌గూడకు వచ్చారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, ఎంపీటీసీ చెన్నయ్య, నాయకులు జనార్దన్‌రెడ్డి, కుద్దూస్, మాధవరెడ్డి, రవీందర్‌నాయక్, సంజీవరెడ్డి, కిషోర్ తదితరులు ఆయనను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

మాజీ సీఎం నాదెండ్లను కలిసిన యాదయ్య

చేవెళ్ల : ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య ఉమ్మడి ఏపీ మాజీ సీఎం నాదెండ్ల భాస్కర్‌రావు, ఏపీ మంత్రి మనోహర్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని నాదెండ్ల నివాసంలో కలిసి పుష్పగుచ్ఛమందించి సన్మానించారు. ఆయనతో కాంగ్రెస్ నాయకులున్నారు.

రవీందర్‌రెడ్డికి సబ్బరిగారి రాజు జన్మదిన శుభాకాంక్షలు



షాబాద్, జూలై 2 : సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నెంటూరి రవీందర్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని మంగళవారం ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సబ్బరిగారి రాజు కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షిప్తంగా..

షాద్‌నగర్‌అర్బన్ : నేటి(బుధవారం)తో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులైన ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, కో-ఆప్షన్ సభ్యుల పదవీ కాలం ముగుస్తున్నది. ఐదేళ్ళుగా చేసిన సేవలకు అభినందనలు తెలుపడానికి బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ కార్యాలయంలో వీడ్కోలు సమావేశం నిర్వహించబోతున్నారు.

కేశంపేట : హిందువులపై విషం చిమ్ముతున్న కాంగ్రెస్ పార్టీని సాగనంపాలని బీజేవైఎం రాష్ట్ర నాయకుడు కంచుకోట మహేష్ డిమాండ్ చేశారు. పోమాల్‌పల్లిలో విలేకరులతో మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా ప్రతిపక్ష నాయకుడు హిందువులను అవమానించాడని విమర్శించారు. హిందువులు ఐక్యత కావలిసిన సమయం వచ్చిందని తెలిపారు.

కందుకూరు : మండల కేంద్రానికి చెందిన తాళ్ల అంజయ్యను లయన్స్‌క్లబ్ జిల్లా అడిషనల్ కేబినెట్ కార్యదర్శిగా నియమించినట్లు ఆ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. అంజయ్యకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. 18సంవత్సరాలుగా కందుకూరు లయన్స్ క్లబ్‌లో అంజయ్య అనేక సేవాకార్యక్రమాలను చేపట్టినట్లు గుర్తుచేశారు. అంజయ్యకు జిల్లా స్థాయిలో గుర్తింపు రావడం పట్ల కందుకూరు లయన్స్ క్లబ్‌కు వన్నె తెచ్చారని అన్నారు.

ఆమనగల్లు : చికెన్, మటన్ షాప్‌ల నుంచి వచ్చే వ్యర్థాల తరలింపునకు ఆమనగల్లు మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం వేలం నిర్వహించారు. చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్‌చైర్మన్ దుర్గయ్య ల అధ్యక్షతన కమిషనర్ వసంత పర్యవేక్షణలో వేలం పాట చేపట్టారు. ముగ్గురు డిపాజిట్‌దారులు పాల్గొనగా కడ్తాల మండలం కర్కల్‌పహాడ్‌కు చెందిన ఆంజనేయులు రూ.3.05 లక్షలకు వేలం దక్కించుకున్నారు.

తలకొండపల్లి : ఆశా కార్యకర్తల సంఘం మండల అధ్యక్షురాలిగా ఎల్.కవిత ఎన్నికైంది. సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కమిటీ నాయకుడు పెంటయ్య సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎన్.శిరీశ, కోశాధికారిగా నిర్మల, సహాయ కార్యదర్శిగా యాదమ్మలతో పాటు 15 మంది కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు.

షాబాద్ : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ సర్పంచ్ మద్దూరి శకుంతల పాండు అన్నారు. చందన్‌వెళ్లికి చెందిన బొంతపల్లి విద్యాసాగర్‌గుప్తా తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం తిమ్మారెడ్డిగూడలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లను అందజేశారు.

షాబాద్ : శ్రీరామ్ జీవితబీమా షాద్‌నగర్ బ్రాంచ్ డీఎం వేణుగోపాల్‌నాయుడు దామర్లపల్లికి చెందిన సురేందర్‌రెడ్డి మృతి చెందడంతో అతని భార్యలతకు శ్రీరామ్ ఇన్సూరెన్స్ కంపెనీ తరఫున రూ.7,72,582 చెక్కును అందించారు. బ్రాంచ్ మేనేజర్ నరేష్, డెవలప్‌మెంట్ ఆఫీసర్ గణేష్, ఏజెంట్లు తదితరులు ఉన్నారు.

షాద్‌నగర్‌అర్బన్ : లయన్స్ క్లబ్ ఆఫ్ షాద్‌నగర్ టౌన్ ఆధ్వర్యంలో నలుగురు అభాగ్యులకు ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేయించారు. షాద్‌నగర్ పట్టణ శివారులోని ఎఫ్‌సీఎస్ ఆశ్రమంలోని అనాథలకు లయన్స్ క్లబ్ షాద్‌నగర్ టౌన్ కోశాధికారి డాక్టర్ డి. రెడ్యానాయక్ పరీక్షలు చేసి, శస్త్ర చికిత్సలు అవసరమైన నలుగురిని గుర్తించారు. వారిని మహబూబ్‌నగర్ రామ్‌రెడ్డి లయన్స్ ఐ హాస్పిటల్‌లో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించారు.

కేశంపేట : బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి శివాజీ.. తెలంగాణ, ఏపీకి చెందిన కేంద్ర మంత్రులు బండి సంజయ్, రామ్మోహన్‌నాయుడులను ఢిల్లీలో కలిశారు. ఈమేరకు శాలువాలతో సత్కరించారు. మంత్రులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయలని సూచించినట్లు శివాజీ పేర్కొన్నారు.

కొందుర్గు : యువత స్వయం ఉపాధితో ఎదగాలని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓ షాపును మాజీ ఎమ్మెల్యే అంజయ్యతో కలిసి ఎమ్మెల్సీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారిని షాపు యజమాని శాలువాతో ఘనంగా సన్మానించారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో ఎద్దు, రెండు గేదెలు మృత్యువాత


బాచుపల్లిలో మృతిచెందిన ఎద్దు

కందుకూరు/షాబాద్, జూలై 2: విద్యుదాఘాతంతో ఎద్దు, రెండు గేదెలు మృతిచెందాయి. కందుకూరు మండలం బాచుపల్లిలో పగడాల యాదయ్య తనకు చెందిన రెండు ఎడ్లతో గ్రామంలో అద్దెకు నాగలి కట్టడానికి వెళ్లి జీవనం సాగిస్తుంటాడు. మంగళవారం గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో విత్తనాలు వేస్తుండగా విద్యుత్ స్తంభం సపోర్ట్ వైరుకు కరెంటు సరఫరా అయ్యింది. ఆ వైరు ఎద్దుకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ దాదాపు రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని యాదయ్య కోరాడు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా విద్యుతాఘాతంతో రెండు గేదెలు మృతిచెందిన ఘటన షాబాద్ మండలం ఉబ్బగుంట పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. బాధితుడు మోతుకూరి శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉబ్బగుంట గ్రామ సమీపంలో మంగళవారం ఉదయం గేదెలు మేపడానికి పొలంలోకి వెళ్లగా.. సత్యనారాయణరెడ్డి మామిడి తోట వద్ద వేలాడుతున్న విద్యుత్ తీగలు గేదెలకు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాయి. బాధితుడు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వాటి విలువ దాదాపు రూ.2 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

షార్ట్ సర్క్యూట్‌తో మొబైల్ షాపు దగ్ధం

షాద్‌నగర్ రూరల్, జూలై 2: విద్యుదాఘాతంతో మొబైల్ షాప్ దగ్ధమైన ఘటన షాద్‌నగర్ పట్టణంలోని పద్మావతి కాలనీలో సోమవారం రాత్రి జరిగింది. షాబాద్ మండలానికి చెందిన శంకర్ అనే పద్మావతి కాలనీలో మొబైల్ రిపేరింగ్, స్పేర్ పార్ట్స్ విక్రయిస్తుంటాడు. అయితే, ఎప్పటి మాదిరిగానే అతడు సాయంత్రం షాపుకు తాళంవేసి ఇంటికెళ్లాడు. ఆ తర్వాత షార్ట్ సర్క్యూట్ కారణంగా షాపులో మంటలు చెలరేగాయి. చుట్టు పక్కల ఉన్నవారు గమనించి అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వెంటనే వచ్చి మంటలను ఆర్పివేశారు. కాగా, సుమారు రూ.లక్ష వరకు నష్టం జరిగిందని బాధితుడు శంకర్ తెలిపాడు.

గంజాయి విక్రేతల రిమాండ్

యాచారం, జూలై 2: అక్రమంగా గంజాయి విక్రయించడానికి యత్నించి పోలీసులకు పట్టుబడిన ఇద్దరు నిందితులను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు చెప్పారు. మంచాల మండల కేంద్రానికి చెందిన బండారు శివ, ఉదయ్‌కుమార్‌లు సోమవారం రాత్రి గాండ్లగూడలో గంజాయి విక్రయించేందుకు యత్నించగా.. అనుమానాస్పదంగా కనిపించడంతో ఎస్సై గోపాల్, సీఐ శంకర్‌కుమార్‌లు అదుపులోకి తీసుకొని విచారించారు. గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసుల ఎదుట నేరం ఒప్పుకున్నారు. వారిపై మొదటి సారిగా ఎన్‌డీపీఎస్ యాక్ట్ 20(11)(బి)(ఏ)ఆర్/డబ్ల్యూ8(సి) కింద కేసులు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా నిందితులకు వైద్యపరీక్షలు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ శంకర్‌కుమార్ తెలిపారు.

హోటల్ భాగస్వాముల తగాదా

● మాట్లాడుకుందామని చెప్పి కత్తితో దాడి

ఇద్దరికి కత్తి పోట్లు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ఆదిభట్ల, జూలై 2 : హోటల్ భాగస్వాముల మధ్య గొడవ కత్తిపోట్లకు దారితీసి ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొంగ్లూరు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దీపక్‌రెడ్డి, శరణ్‌రెడ్డిలు భాగస్వాములుగా బొంగ్లూర్ గేట్ వద్ద కృతుంగ పేరుతో రెస్టారెంట్(హోటల్)ను ఏర్పాటు చేశారు. కాగా హోటల్ వ్యాపారం సరిగా నడవకపోవడంతో దీపక్‌రెడ్డి అనే వ్యక్తి తన వాటాను ఇచ్చేయ్యాలంటూ శరణ్‌రెడ్డిని అడిగాడు. దాంతో శరణ్‌రెడ్డి హోటల్ ఏర్పాటు సమయంలో దీపక్‌రెడ్డి పెట్టిన పెట్టుబడి రూ.7లక్షలు ఇచ్చేశాడు. అయితే, తనకు గుడ్‌విల్ కింద మరో రూ.3లక్షలు ఇవ్వాల్సిందిగా దీపక్‌రెడ్డి డిమాండ్ చేస్తూ కొద్ది రోజులుగా శరణ్‌రెడ్డితో గొడవకు దిగుతున్నాడు. ఈక్రమంలో మంగళవారం తెల్లవారుజామున దీపక్‌రెడ్డి.. శరణ్‌రెడ్డికి ఫోన్‌చేసి గుడ్‌విల్ డబ్బులు డిమాండ్ చేశాడు. హోటల్‌కు వస్తే మాట్లాడుకుందామంటూ శరణ్‌రెడ్డి తెలిపాడు. మంగళవారం సాయంత్రం 3.30 ప్రాంతంలో దీపక్‌రెడ్డి హోటల్‌కు వచ్చి ఫోన్‌చేసి కిందికి రా అని అన్నాడు. శరణ్‌రెడ్డి కిందకు రాకపోవడంతో తన స్నేహితుడు వంశీతో కలిసి హోటల్ రూమ్ నెంబర్ 101లో మద్యం సేవించాడు. తరువాత శరణ్‌రెడ్డి దగ్గరికి వెళ్లి డబ్బుల విషయంలో గొడవకు దిగాడు. అప్పటికే మద్యం సేవించి ఉన్న దీపక్‌రెడ్డి తన వెంట తీసుకువచ్చిన కత్తిని జేబులో నుంచి తీసి శరణ్‌రెడ్డిపై.. అడ్డుగా వచ్చిన అతడి మేనల్లుడిపై దాడి చేశాడు. దాంతో శరన్‌రెడ్డికి తలపై, మేనల్లుడికి కడుపులో గాయమై రక్తస్రావం జరిగింది. నిందితుడు పారిపోవడంతో గాయపడిని ఇద్దరిని మన్నెగూడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పార్టీలకతీతంగా సేవచేస్తా : ఎమ్మెల్యే కసిరెడ్డి



మాట్లాడుతున్న కసిరెడ్డి నారాయణరెడ్డి

మాడ్గుల, జూలై 2 : ఎన్నికలు ఉన్నపుడు మాత్రమే పార్టీలకు పనిచేయాలని, ఆ తరువాత అందరు సమానమేనని, పార్టీలకతీతంగా పనిచేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గౌరవరం పద్మ అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరయ్యారు. ముందుగా ఎజెండా అంశాలను చదివి వినిపించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో, తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత ఉందని, ఆర్కపల్లిలో బ్యాంక్ ఏర్పాటు చేయాలని కోల్కులపల్లి ఎంపీటీసీ భట్టు కిషన్‌రెడ్డి కోరారు. నర్సంపల్లి నుంచి కుర్మేడ్ వరకు రోడ్డు వేయాలని మాడ్గుల ఎంపీటీసీ పాండుగౌడ్ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అప్పారెడ్డిపల్లి శివారులో ప్రభుత్వ భూమిని 330 ఎకరాలు ఉండగా.. 400ఎకరాలుగా నకిలీ పత్రాలు సృష్టించి పట్టా పాస్ పుస్తకాలు ఇచ్చారని వైస్ ఎంపీపీ శంకర్ నాయక్ ఆరోపించారు. అనంతరం ఎంపీటీసీ సభ్యులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంపీపీ గౌరవరం పద్మరెడ్డిని ఎమ్మెల్యే సన్మానించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


మాట్లాడుతున్న చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

చేవెళ్ల, జూలై 2 : రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, త్వరతలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తుందని ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ముడిమ్యాల్ సొసైటీ కార్యాలయం ఆవరణలో రైతు భరోసా పథకంపై రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టారు. గ్రామంలోని రైతుల నుంచి సూచనలు, సలహాలు, అభిప్రాయాలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం రైతు భరోసాతోపాటు సబ్సిడీపై డ్రిప్ పరికరాలు, వ్యవసాయ పనిముట్లు ఇచ్చేవిధంగా ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు. జిల్లా వ్యవసాయ సహకార అధికారి ధాత్రిదేవి, వైస్‌చైర్మన్ మల్లేశ్, ఆడిటర్ నర్సింహారావు, డైరెక్టర్లు రాములు, లక్ష్మయ్య, ప్రవీణ్‌రెడ్డి, మాధవరెడ్డి, శివరాజ్, నరేందర్, ఉపేందర్‌సింగ్, అరుణమ్మ, బాలమ్మ, సీఈవో భరత్‌కుమార్, సొసైటీ మాజీ అధ్యక్షుడు బల్వంత్‌రెడ్డి, ఏవో తులసీ, ఏఈవో వరుణ్ తదితరులున్నారు.